జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

సాగు,తాగునీరు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - గుంతకల్లు

మండలంలోని చెరువులలో పూడికను తీయించి రాగులపాడు గ్రామం వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి హంద్రీ నీవా కాలువ ద్వారా నీరు మళ్లించి రైతులకు సాగు నీరు,ప్రజలకు తాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో పార్టీ శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నల్లప్పతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. శ్రీనివాసులు మాట్లాడారు. మండలంలోని దోనిముక్కల, పులగుట్టపల్లి, నెలకొండ, నాగసముద్రం, అయ్యవారిపల్లితో పాటు గుత్తి, పామిడి మండలాలలోని గ్రామాల్లో ఉన్న చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. అదే విధంగా రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుండి పిల్ల కాలువ ద్వారా చెరువులకు, చిన్నచిన్న కుంటలకు నీరు వదలాలన్నారు. ఏడాదికి మూడు పంటలు పండించే విధంగా శక్తివంతమైన, సారవంతమైన భూములు నియోజకవర్గంలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువులలో పూడిక తొలగించి నీరు నిలువ ఉంచుకునే విధంగా చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, పట్టణ నాయకులు కసాపురం రమేష్, జగ్గలి రమేష్, రంగమ్మ, సురేంద్ర, సభ్యులు రామునాయక్, ఓబులేసు, జయమ్మ, సుగుణమ్మ, జగదీష్, లక్ష్మీ, సుంకన్న, బాషా, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు బోల్తా ... నలుగురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - రాయదుర్గం

బోల్తాపడిన బడిబస్సు

అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం గోనబావి గ్రామం వద్ద ఆదివారం ఉదయం ప్రయివేటు పాఠశాలకు చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని ఎవిఆర్ పాఠశాలకు చెందిన బడి బస్సు విద్యార్థులను తీసుకొని గోనబావి నుండి వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఒక విద్యార్థికి భుజం ఎముక విరగగా, ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ బస్సును వదిలి పరారయ్యాడు. స్థానికులు గాయపడిన విద్యార్థులను రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు వీరికి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యుఐ, ఎఐవైఎఫ్ నాయకులు, సిపిఎం, సిపిఐ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. ప్రమాదంలో విద్యార్థులు గాయపడితే మండల విద్యాశాఖ అధికారులు కానీ పాఠశాల యాజమాన్యం కానీ ఆసుపత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని విచారించలేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల యాజమాన్యాలు కండిషన్లో లేని బస్సులను కర్నాటక రాష్ట్రం నుండి తెచ్చి వాటికి పెయింట్ చేయించి వాటిని రోడ్లలో తిప్పుతున్నారని విమర్శించారు. గుమ్మగట్ట రోడ్డులో ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు పోటాపోటీగా అతి వేగంగా నడుపుతుంటారని స్థానికులు విమర్శించారు. ఈ ఘటన వల్ల విద్యార్థులకు జరగరానిది ఏదైనా జరిగితే దానికి బాధ్యులు ఎవరని విద్యార్థి సంఘాల నాయకులు నిలదీశారు. పాఠశాలను, బస్సును సీజ్ చేయాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొట్రేష్, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా నాయకులు అనిల్, సిపిఎం నాయకులు మల్లికార్జున, మధు, సిపిఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ అనంత సాధనే లక్ష్యంగా ప్రజలతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులందరూ సమిష్టగా పని చేయనున్నట్లు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రగతి, అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలు, సాధించిన ప్రగతి గురించి వివరించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అన్ని శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

మాట్లాడుతున్న కలెక్టర్

'స్వర్ణ అనంత' సాధనే లక్ష్యం

- **కలెక్టర్ వినోద్‌కుమార్**
- **పోలీస్‌పరేడ్‌లో జాతీయ పతాకావిష్కరణ**
- **ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన**
- **ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు**
- **జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు**

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టర్

స్వర్ణ అనంత సాధనే లక్ష్యంగా పనిచేద్దామని, జిల్లాను అన్నిరంగాల్లో అగ్రస్థానంలో ఉంచుదామని కలెక్టర్ డాక్టర్. వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ జాతీయ పతాకావిష్కరణ చేసి, జాతీయ గీతాలాపన చేశారు. తదనంతరం పెరేడ్ వీక్షణ చేసి సాయుధ దళాల నుంచి గౌరవ వందనాన్ని ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ సందేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చదివి వినిపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సింగల్ డెస్క్ పథకం ద్వారా 160 పరిశ్రమలు 303 అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోగా, అందులో 276 అనుమతులు మంజూరు చేసినట్లు వివరించారు. నీటి సంరక్షణలో భాగంగా హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఈ ఏడాది 40 టీఎంసీల నీటిని కేటాయించగా, 19.692 టిఎంసిల నీరు వాడుకున్నామని జిల్లాలో 34 చెరువులను నీటితో నింపామని చెప్పారు. జిల్లాలో హంద్రీనీవా కాలవను 2,200 క్యూసెక్కుల నుంచి 3,450 క్యూసెక్కుల నీటి ప్రవాహం పెరిగేలా మొదటి దశలో గుంతకల్లు మండలం కసాపురం నుంచి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు పనులు చేపడుతున్నామన్నారు. రెండవ దశలో జీడిపల్లి నుంచి శ్రీ సత్యసాయి జిల్లా సరిహద్దు వరకు టెండర్ల దశ పూర్తి చేసి కాలువ లైనింగ్ పనులు చేపడతామన్నారు. జిల్లాలోని బొమ్మనహాళ్, డి.హీరేహాల్, కనేకల్, ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు మండలాల్లో 300 హెక్టార్లలో నూతన ఆయిల్ ఫామ్ తోటల విస్తరణ కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీఐఐసీ వారి ద్వారా జిల్లాలోని కూడేరు మండల కేంద్రం వద్ద 353.48 ఎకరాలలో కొత్త పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నామన్నారు. జిల్లా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి, జిల్లా మంత్రులకు, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పభుత్వ ఆశయం మేరకు, ప్రభుత్వం ఇస్తున్న ప్రతి పైసాను పారదర్శకంగా అట్టడుగున వున్న నిరుపేదల చెంతకు నేరుగా అందించడానికి, ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాల ఫలాలను పేదల దరిచేర్చడానికి జిల్లాలో వున్న ప్రతిఒక్కరూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. అనంతరం వేదిక ముందు నుంచి పరేడ్ బృందం నిష్క్రమించగా, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతికకార్యక్రమాలను నిర్వహించారు. వివిధ శాఖల పరిధిలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా అధికారుల డ్రెస్ కోడ్ ధరించడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా జిల్లాలో సేవలందిస్తున్న ఎన్జీవోలు, ప్రముఖులను ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్‌ఒ ఎ.మాలోల, ఆర్డీవోలు కేశవ నాయుడు, వసంత బాబు, సిపిఒ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మతో పాటు ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు గౌరవ వందనం చేస్తున్న పోలీసు జాగిలం

గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గణతంత్ర దినోత్సవ వేడుకలను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ఎస్సీలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివరంగా ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఏటా కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్న, ఇంకా పలు ఎస్సీ కాలనీలలో తాగునీరు, రహదారులు, వీధిలైట్లు, శ్మశాన వాటికలు తదితర మౌలిక సదుపాయాలు లేకపోవటంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్సీ విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేసి వారి విద్యకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఉన్నత చదువులకు తగిన నిధులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తోంది. వసతిగృహాల్లో సైతం పలుచోట్ల తాగునీరు, ప్రహరీ, సొంత భవనాలు లేనందున ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో డప్పు కళాకారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. అయితే ఇంకా పలు ఎస్సీ డప్పు కళాకారులు పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఎస్సీ వసతి గృహాలు ఉన్నాయి? అమలు చేస్తున్న పథకాలు వివరించండి?

జవాబు : జిల్లాలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 ప్రీమెట్రిక్ వసతిగృహాలు, 9 కళాశాల వసతిగృహాలు, ఇంటర్ నుంచి పీజీ వరకు నిర్వహించడం జరుగుతోంది. ప్రీ మెట్రిక్ వసతి గృహాలను మూడు నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఒటున్నారు. ఈ వసతి గృహాల్లో మొత్తం 2034 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు నాణ్యమైన

విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం తగిన మౌలిక సౌకర్యాలు కల్పిస్తోంది. వసతిగృహాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, కార్పెట్లు మొదలగునవి ఉచితంగా అందిస్తోంది. నెలకు రూ. 1150 నుండి రూ. 1600 వరకు డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు రూ. 130 నుండి 250 రూపాయల వరకు చెల్లిస్తుంది.

ప్ర : వసతిగృహాల్లో వసతులు, సౌకర్యాలు ఏమిటి? విద్యార్థులకు అందిస్తున్న పథకాలు వివరించండి?

జ : జిల్లాలోని 23 సాంఘిక శాఖ వసతిగృహాల మరమ్మతులకు, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ. 5.85 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే మరమ్మతు పనులు చేపట్టి ఇతర సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటాము. ఎస్సీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఐటిఐ, పాలిటెక్నిక్ నుంచి పీజీ వరకు అర్హులైన విద్యార్థులకు వసతి, భవన ఇతర ఖర్చులకోసం నగదు మంజూరు చేయబడుతుంది. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి క్రింద ఆర్థిక వెనుకబడిన ఎస్సీ విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించే వారికి తగిన ఫీజులు ప్రభుత్వం భరిస్తుంది. నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు 2024 డీఎస్సీ ఉచిత కోచింగ్ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

ప్ర : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించండి?

జ : ప్రధానమంత్రి అనుచిత అభ్యుదయ యోజన (పీఎం ఏ జె వై) పథకం క్రింద వివిధ రకాల చేతివృత్తుల వారి కోసం ఆర్థిక సహాయం అందించడం జరుగుతుంది. ఈ పథకం కింద ఆరు బాలికల వసతిగృహాల నిర్మాణం కోసం రూ. 33 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద విద్య, ఆరోగ్యం, తాగునీరు, రహదారులు తదితర సమగ్ర అభివృద్ధికి గ్రామాలను కేంద్రం ఎంపిక చేసింది. 500 జనాభా కంటే ఎక్కువ ఉన్న జనాభాలో 40 శాతం కన్నా ఎక్కువ ఉన్న గ్రామాల అభివృద్ధి కోసం ఈ పథకం ప్రవేశపెట్టారు. సత్యసాయి జిల్లాలో అమరాపురం మండలం హల్కూరు గ్రామం ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం పారిశుధ్య నిర్మాణాల కోసం నేషనల్ యాక్షన్ ఫర్ మెకానైజ్డ్ శానిటేషన్ ఏకో సిస్టం పథకం ప్రవేశపెట్టింది. ఇది శానిటేషన్ కార్మికుల సంక్షేమం, సురక్షితమైన శానిటేషన్ సేవలను ప్రోత్సహించడానికి ప్రవేశపెట్టారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన పరికరాలు రక్షణ పరికరాలు అందించడం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. కార్మికులకు సాంఘిక భద్రత, ఆరోగ్య బీమా పింఛను వంటి ప్రయోజనాలు అందించడం జరుగుతుంది.

ప్ర : ఇతర పథకాలు వివరించండి?

జ : ఎంపికైన డప్పు కళాకారులకు ప్రతినెల రూ. 4వేల పింఛను మంజూరు అవుతోంది. ఇంకా

శివరంగప్రసాద్

పలువురు కళాకారులు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలించి వారి దరఖాస్తులను ప్రభుత్వానికి పంపి మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. అలాగే ఎస్సీ కుటుంబాల వారికి నెలకు 200 యూనిట్లు విద్యుత్ వాడకంపై బిల్లులు లేకుండా ఉచితంగా వినియోగించుకోనే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంది.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? ఎస్సీ వర్గాలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ: ఉన్న సిబ్బందితోనే పనిచేసుకుంటున్నాం. ఎస్సీల అభివృద్ధి సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయి. వాటిని విద్యార్థులు, ఎస్సీలు అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలి. విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి.

రెవెన్యూ అధికారికి ఎమ్మెల్యే అనుచరుడి బెదిరింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సోషల్‌మీడియాలో ఆడియో హల్‌చల్



'నేను గడిచిన ఐదేళ్లు బాగా నష్టపోయాను....పెళ్లాం తాలిబొట్టు కూడా తాకట్టు పెట్టాను.. ఎమ్మెల్యేకు రైట్ హ్యాండ్‌ను...ఆమెనే చెప్పింది...ఇసుక తోలుకుంటాను...నువ్వు వచ్చి ఆపొద్దు..' అంటూ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అనుయాయుడి ముఖ్యమైన అనుచరుడు రెవెన్యూ అధికారిని బెదిరిస్తున్న ఆడియో ఒకటి సోషియల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇసుక అక్రమ తవ్వకాలు జరపవద్దని..ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలకు సూటిగానే ఇది వరకు హెచ్చరికలు జారీ చేశారు. కాని ఆచరణలో ఆ హెచ్చరికలేవీ పనిచేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈ ఆడియోలో ఎక్కడ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయన్న దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ తవ్వకాలు జరుగుతున్నాయి..అడ్డుకొవద్దని చేసిన హెచ్చరికలు మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. 'అవసరమైతే రికార్డు చేసుకో..నేను ఎవరికి భయపడను.. ఎమ్మెల్యేకి రైట్ హ్యాండ్ నేను..సిఐ కూడా చెప్పాను ఎమ్మెల్యే కూడా చెప్పారు.నీవెందుకు ఆపాతున్నావు..రేపు నీవొచ్చినా ఇసుక తోలడం మాత్రం ఆపను.నేను డబ్బులు పెట్టి కొని తోలుతున్నా..భార్య పుస్తెలు కూడా తాకట్టు పెట్టి కొన్నాను. దాన్ని అడ్డుకుంటే సరైంది కాద'ని అనుయాయుడు హెచ్చరించాడు.దానికి అనుమతుల్లేవని సదరు అధికారి చెప్పారు. సమస్యను తహశీల్దారు దృష్టికి కూడా తీసుకెళతానని వారు చూసుకుంటారని రెవెన్యూ అధికారి చెప్పారు. ఇది ఇలాగుంటే ఆ నియోజకవర్గంలో ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. కొంత మంది నాయకులు ఇసుక తవ్వకాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అటు పోలీసు, ఇటు రెవెన్యూ అధికారుల ప్రమేయం కూడా ఇందులో ఉందన్న ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో పెన్నా నది ప్రవహిస్తుంది. ఈ పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక ఉంది. ఈ ఇసుకను కొంత మంది నాయకులు తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

కళ్లుమూసుకున్న అధికారులు ?

ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కు పాదం మోపుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెబుతున్నారు. కాని ఆచరణలో అమలు జరగడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, ముఖ్య నేతల కనుసన్నల్లోనే అనుమతుల్లేకుండానే ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని నిలువరించాల్సిన అధికారులు కళ్లు మూసుకుని మౌనంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది.

రాజకీయ కుట్ర

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

దళిత ఎమ్మెల్యే అయిన తనను రాజకీయంగా కుట్ర చేస్తూ సామాజిక మాధ్యమాల్లో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వారంరోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆడియోలకు తనతోపాటు తన కుటుంబానికి, టిడిపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు దూరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాపై గెలిచిన మొదటి రోజునే ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశానన్నారు. ఇసుకను ఎవరు అక్రమంగా తరలించినా అడ్డుకోవాలని చెప్పామన్నారు. తన రాజకీయ ఎదుగుదలను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నంలో ఇలాంటి దుష్ప్రచారం సాగుతోందన్నారు. దళిత మహిళ ఎమ్మెల్యేననే చిన్నచూపుతో కొన్ని దుష్టశక్తులు రోజూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయో గమనించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీకి సంబంధించిన వారైనా వారి వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారన్నారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నా కొందరు పోలీసుల కళ్లుగప్పి రవాణా చేస్తున్నారు. పోలీసులకు సైతం ఇసుక అక్రమ రవాణా పై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశానని చెప్పారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు

ఉరవకొండలో నిరసన తెలుపుతున్న సిపిఎం, సిఐటియు, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ప్రజా ధనాన్ని దోచిపెడుతూ కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని రైతు, కార్మిక సంఘాల నేతలు అన్నారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా విధానాలను వ్యతిరేకిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ వెల్ఫేర్ కాంప్లెక్స్ నుంచి స్కూటర్ ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, రైతుసంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సి.మల్లికార్జున, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్పయాదవ్, రైతు కూలీసంఘం జిల్లా నాయకులు కృష్ణ, రాయుడు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, రైతు కూలీసంఘం నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు సాగిన రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలివేసిందన్నారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాలలోని విధానాలతోనే తిరిగి చట్టాలను తీసుకువస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం కొనసాగించేలా వ్యవహరిస్తోందన్నారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాడి సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలు మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీల గొడుగు క్రిందకు చేర్చడమే లక్ష్యంగా ఉందన్నారు. సహకార వ్యవస్థలన్నీ కంపెనీల హస్తగతం అవుతాయని తెలిపారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానమే లేదు. వ్యాపారులు ఇష్టారాజ్యం అవుతుందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం పునర్ పరిశీలించి రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర సి2+50 ప్రకారం చట్టం చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు గృహ వినియోగానికి ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలన్నారు. రైతులకు అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలన్నారు. కేరళ తరహాలో రైతు రుణ ఉపశమన చట్టం చేసి అన్నిరాష్ట్రాల్లో అమలు చేయాలన్నారు. జిల్లాకు సరిపడా నికర జలాలు కేటాయించి, హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలన్నారు. 404, 405 జిఓలు రద్దు చేసి, 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలన్నారు. కౌలు రైతులకు అందరికీ గుర్తింపు కార్డు ఇచ్చి రుణాలు పంట నష్టపరిహారం, బీమా ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ 10 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచి, రోజుకు వేతనం రూ.600 చెల్లించాలన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ నిలిపివేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ ఆపాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బిహెచ్.రాయుడు, వెంకట కొండ, బి.చంద్రశేఖర్, సంజీవరెడ్డి, సిఐటియు నాయకులు సురేంద్ర, ఎర్రిస్వామి, అమర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సిఐటియు, రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ, వజ్రకరూరు మండల కేంద్రాల్లో నిరసనలు తెలిపారు. ఇందులో భాగంగా ఉరవకొండలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.మధుసూదన్, విరుపాక్షి, రైతుసంఘం నాయకులు మురళి, సిద్దప్ప, బాబు, రామాంజనేయులు, సిఐటియు నాయకులు చంద్రశేఖర్, వాటాల సుధాకర్, ఓబుళపతి, ఆవుల బాసి, నారాయణస్వామి, తలారి శివ, మహబూబ్‌బాషా, చాకలి నాగేంద్ర, ఆవుల నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, సిఐటియు, రైతుసంఘం నాయకులు

పామిడి : రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక దీక్ష చేస్తున్న రైతు ఉద్యమ నాయకుడు దల్లేవాల్ ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని రైతుసంఘం మండల అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, కార్యదర్శి ముత్యాలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం రైతులతో కలిసి మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, నాగరాజు, శివకుమార్, శ్రీరాములు, మాబు, షాను, జిలాన్‌బాషా, సత్తార్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని తూర్పు కోడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కందుల సేకరణ కేంద్రాన్ని టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల చేతుల్లో పడి మోసపోకుండా ప్రభుత్వమే క్వింటాకు రూ.7,550 మద్దతు ధరతో కందులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని కూడా కేవలం పది రోజుల్లోనే రైతుల ఖాతాలకు జమచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, మండల అధ్యక్షులు గోళ్ల వెంకటేసులు, అర్జీ శివశంకర్, కరణం మల్లికార్జున, మల్లేపల్లి నారాయణ, కొల్లాపురప్ప, కోడిపల్లి రామాంజనేయులు, కొండాపురం సర్పంచ లాల్‌కృష్ణ, తలారి సత్యనారాయణ, బసవరాజు, శివానంద, చౌడప్ప, నాగన్న, రైతుసంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్‌కు ఉద్యోగోన్నతి

శింగనమల : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సి.గంగాధర్‌కు ఎఎస్‌ఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్, ఎఎస్ఐ చిరంజీవి, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి-ఉరవకొండ

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మహిళలను కించ పరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. డొక్కా మాణిక్యవరప్రసాద్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన శశికళతో రాష్ట్ర మహిళలను పోలుస్తూ.. ఆమె చెప్పినట్లే వైసిపి నడుస్తోందని చెప్పడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రజలు, మహిళలు చాలా తెలివైనవారని.. అంతేకాకుండా హుందాగా ఉంటారనే విషయాన్ని డొక్కా గ్రహించాలన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా మాట్లాడి పదవులు సంపాదించాలని చూస్తున్న మాణిక్యవరప్రసాద్ వెంటనే మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే వారు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముస్లిం మైనార్టీల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయినగర్‌లోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో నిర్వహించిన గణతంత్ర్య దినోత్సవ వేడుకలకు నగరంలో ఉలేమాలు, ముస్లిం ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముస్లిం నాయకులు, మేధావులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, అడ్వకేట్ ఐ.రవీంద్ర, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్ర శేఖర్ చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతం పాడి ఐకమత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీల సంఘాల నేతలు మాట్లాడుతూ త్వరలోనే అనంతపురంలో స్థాపించబోతున్న అధికారిక ముస్లిం మైనారిటీ సంస్థ "అంజుమన్ ఎ ఇస్లామియ" గురించి అందరికీ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, అడ్వకేట్ అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్, సీపీఎం నగర నాయకులు వలి, జీలాన్, గౌస్ పీర్, అష్రఫి, మసూద్, హరూన్, మౌలానా రషీద్, కాంగ్రెస్ దాదా గాంధీ, మార్కెట్ యార్డ్ ఫయాజ్, జనబలం బాబా, జమాతే హింద్ నవాజ్, తాజ్, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అంబేద్కర్ భవన్‌లో మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాలాపన చేశారు. స్వీకరించారు. తదనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకష్ణారెడ్డి, డిపిఎం ఆనంద్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ఎమ్మెల్యే బాలయ్యకు అభినందనలు

ఉరవకొండ : పద్మభూషన్ అవార్డుకు ఎంపికైన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే బాలయ్య దాదాపు ఐదు శతాబ్దాలుగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో అద్భుతమైన సేవలు అందిస్తున్నారన్నారు. దీనికితోడు ఎమ్మెల్యేగా హిందూపురం ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. వీటన్నింటిని మించి తన సినిమాల ద్వారా ప్రజలకు ఉత్సాహ పరుస్తున్నారన్నారు. అలాంటి బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై శుభాభివందనాలు తెలిపారు.

నార్పల : పద్మశ్రీ అవార్డులు పొందిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అభిమాన నాయకుడు బాలకృష్ణ ఇటు రాజకీయాలు, అటు వైద్యసేవల్లో రాణిస్తుండటం తెలిసిందే అన్నారు. అలాగే మాదిగల గుండెచప్పుడు మందకృష్ణ మాదిగకు అవార్డులు రావడం సంతోషకరమన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-అనంతపురం

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్పందన ఆర్గనైజేషన్ ఫౌండర్, సిఇఒ చరణ్‌నంద కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి వార్డు అందుకున్నారు. స్పందన ఆర్గనైజేషన్ చేసిన సమాజ సేవను గుర్తించి అవార్డును అందజేశారు. అలాగే కుందుర్పి మండల వ్యాప్తంగా విలువల బడులు, పర్యావరణ పరిరక్షణ, స్వయం ఉపాధి శిక్షణ లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్కే లెనిన్‌బాబు అనంతపురంలో కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి పురస్కారం అందుకున్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే నూర్ మహమ్మద్ ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సిఇఒ రామచంద్రారెడ్డితో ఉత్తమ ఉద్యోగి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండల పరిధిలోని ముద్దినాయనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్లికార్జునపల్లి సబ్ సెంటర్‌లో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న హెచ్.నాగలక్ష్మి ఉత్తమ అవార్డు అందుకుంది. అలాగే స్థానిక వెటర్నరీ విభాగంలో ఉత్తమ సేవల అందించిన ఎం.రామ్మూర్తి అనంతపురం జిల్లా కేంద్రంలోని పరేడ్‌లో ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు.

బొమ్మనహాల్ : అనంతపురంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తహశీల్దార్ మునివేలు కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నారు. బొమ్మనహాల్‌తోపాటు డి.హీరేహాల్ మండలంలో సక్రమంగా విధులు నిర్వహిస్తున్నందున అవార్డును ప్రదానం చేశారు.

పామిడి : మండల కేంద్రంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అనంతపురంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. దాదాపు 70 మంది విద్యార్థులు వేడుకల్లో నృత్యప్రదర్శన చేసినట్లు ఉపాధ్యాయులు రామాంజనేయులు తెలిపారు.

ఆత్మకూరు : అనంతపురంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్పీ పి.జగదీష్ నుంచి మండల కేంద్రంలో పని చేస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నారు.

శింగనమల : శింగనమల ఎంపిడిఒ నిర్మలాకుమారి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈమేరకు ఆదివారం అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా పరిషత్ సిఇఒ రామచంద్రారెడ్డి నుంచి అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిపి యోగేశ్వరి, సర్పంచు నాగ మునెమ్మ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఎంపిడిఒకు శుభాకాంక్షలు తెలిపారు.

బ్రహ్మసముద్రం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.నందకిషోర్, ఉపాధి హామీ గ్రామీణ పథకం టెక్నికల్ అసిస్టెంట్ డి.పండరీష్, మండల రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పాటిల్ నాగిరెడ్డి ఉత్తమ అవార్డులు పొందారు. ఈమేరకు ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఉరవకొండ : గత ఏడు సంవత్సరాలుగా జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన ఆదర్శవంతమైన రైతాంగ సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ అవార్డును అందజేసింది. ఈమేరకు ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, రజనీకుమారి దంపతులకు కలెక్టర్ వినోద్‌కుమార్ అవార్డును అందజేశారు.

పురస్కారం అందుకుంటున్న స్పందన ఫౌండర్ చరణ్‌నంద

పురస్కారం అందుకుంటున్న బ్రహ్మసముద్రం అధికారి

శింగనమల ఎంపిడిఒ నిర్మలాకుమారి

కళ్యాణదుర్గం వెటర్నరీ విభాగంలో పని చేస్తున్న ఎం.రామూర్తి

ఎస్‌కెఆర్‌సి క్లబ్ నూతన కమిటీ ఏర్పాటు

ఉరవకొండ : ఉరవకొండలోని ఎస్‌కెఆర్‌సి క్లబ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎస్‌కెఆర్‌సి క్లబ్ కార్యదర్శిగా రవీంద్ర, ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామినాయుడు, సహాయ కార్యదర్శిగా వి.రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు మారెన్న, విజయ్‌భాస్కర్, నాగభూషణం, నాగరాజు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం సహాయ కార్యదర్శి వి.రమేష్‌బాబును సన్మానించారు.


ఎస్‌కెఆర్‌సి సహాయ కార్యదర్శి వి.రమేష్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

శోభాయమానంగా సేవాలాల్ సద్భావన యాత్ర

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఛారిటబుల్ ట్రస్ట్ (సేవాఘడ్), ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఎఐబిఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో నిర్వహించిన మాతా జగదాంబ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ శాంతి సద్భావన రథయాత్ర శోభాయమానంగా సాగింది. ముందుగా 2వ రోడ్డులోని బంజారా భవన్‌లో మాతా జగదాంబ, సంత్ శ్రీ సేవాల్ మహరాజ్‌కు భోగ్ బండార్ నిర్వహించారు. అనంతరం శాంతి సద్భావన యాత్రను సేవాఘడ్ ట్రస్ట్ ఛైర్మన్ జగన్నాథరావు జెండా ఊపి ప్రారంభించారు. బంజారా భవన్ నుంచి టవర్‌క్లాక్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, ఆదర్శనగర్‌లోని మారెమ్మ దేవాలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించి, అనంతరం నాయక్‌నగర్‌లోని మారెమ్మ ఆలయం వద్ద రథయాత్ర ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13, 14, 15 తేదీల్లో సేవాఘడ్‌లో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేసేందుకు యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆంగ్ల జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎఐబిఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాబునాయక్, జిల్లా అధ్యక్షులు ఎస్.బాలాజీ నాయక్, సేవాఘడ్ ట్రస్టు వర్కింగ్ ప్రెసిడెంట్, రవీంద్రనాయక్, ఉపాధ్యక్షులు ఎస్‌కె.కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి సి.అశ్వర్థనాయక్, కోశాధికారి బాలానాయక్, ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ నాయక్, చక్రినాయక్, ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.అశోక్ నాయక్, బంజారా భవన్ స్థల దాత హరిశౌరినాయక్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ శేఖర్, ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు జడ్పీటిసి పాలే జయరాం నాయక్, సేవాఘడ్ టు పోహరాగడ్ పుస్తక రచయిత ఎఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సద్భావన యాత్రలో పాల్గొన్న బంజారాలు, ఎఐబిఎస్ఎస్ నాయకులు

రూ.291కోట్లతో 'ఇంటింటికీ కొళాయి'కి ప్రతిపాదనలు

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీరు అందించేందుకు రూ.291కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాలని విప్ కాలవ శ్రీనివాసులు గ్రామీణ నీటి పారుదల అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వడానికి రూపొందించిన ప్రాథమిక ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో ఆదివారం రాయదుర్గంలోని నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో ప్రతిఇంటికీ కొళాయి ద్వారా రక్షిత నీరు అందించేందుకు సుమారు రూ.291 కోట్లతో ప్రాథమికంగా ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాసులు వివరించారు. అలాగే పిఎబిఆర్ నుంచి శ్రీరామిరెడ్డి పథకం ద్వారా ప్రస్తుతం నీటిని అందిస్తున్న పైప్‌లైన్ మార్చి దాని సామర్థ్యం పెంచాల్సిన అవసరాన్ని అధికారులు ప్రతిపాదనల్లో చేర్చారు. 12ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన సదరు పైప్‌లైనుకు తరచూ మరమ్మతులు వస్తున్న కారణంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు పంపిణీ పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.155కోట్లు అవసరం ఉంటుందన్నారు. అలాగే సుమారు 90 నీటి ట్యాంకుల నిర్మాణానికి పంపిణీ లైన్ల ఏర్పాటుకు రూ.56.89 కోట్లు అవసరం అవుతుందన్నారు. సిఎం చంద్రబాబు ఫింఛన్ల పంపిణీ కోసం ఇటీవల నేమకల్లు గ్రామాన్ని సందర్శించిన సమయంలో రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ ప్రజలకు రక్షిత మంచి నీటిని ప్రాధాన్యత క్రమంలో అందిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా అధికారుల రూపొందించిన రూ.291 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలను సిఎం దృష్టికి తీసుకెళ్లి, వాటికి పాలనపరమైన ఆమోదం లభించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రతిపాదనలను విప్ కాలవకు వివరిస్తున్న అధికారులు

దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి

బ్రహ్మసముద్రం జడ్‌పిటిసికి వైసిపి నేతల సవాల్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

వైసిపి గుర్తుపై గెలిచిన జడ్పిటిసి ప్రభావతమ్మకు దమ్ముంటే రాజీనామా చేసి తిరిగి గెలవాలని మండల వైసిపి నాయకులు సవాల్ విసిరారు. ఆదివారం మండలంలోని ఎస్.కోనాపురం గ్రామంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గంగాధరప్ప స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండల కన్వీనర్ బసవరాజు మాట్లాడుతూ జడ్పిటిసి ప్రభావతమ్మ వైసిపి హయాంలో వచ్చిన నిధులను ఎలా ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇచ్చిన వైసిపి ఫ్యాన్ గుర్తుపై గెలిచిన ప్రభావతమ్మ పార్టీ మారి రాజకీయ విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి హయాంలో అభివృద్ధి జరగలేదని చెబుతున్న ప్రభావతమ్మ జిల్లా పరిషత్ లెక్కల ప్రకారం రూ.70 నుంచి రూ.80 లక్షల వరకూ జడ్పిటిసికు గ్రాంట్ ఇచ్చినట్లు చెబుతున్న లెక్కలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ కాలువకు భూములు ఇచ్చిన రైతులకు రూ.84కోట్ల నష్టపరిహారం అందించిన విషయాన్ని మరిచిపోయిందన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ వైసిపి నాయకులు గంగాధరప్ప, కరణం రాహుల్, చంద్రశేఖర్‌రెడ్డి, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, పోలేపల్లి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

మృతిచెందిన మానం విజయ

పెద్దవడుగూరు : మండలంలోని మల్లేనిపల్లిలో మానం విజయ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..విజయ భర్త వెంకటేశ్వర్లుతో కలిసి గ్రామంలోని పొలంలో ఉన్న కందిపంటను కోయడానికి వెళ్లారు. పనులు చేస్తూ బహిర్భుమికి వెళ్లివస్తానని భర్తతో చెప్పి వెళింది. ఎంతసేపటికీ భార్య రాకపోవడంతో వెంకటేశ్వర్లు వెళ్లి చూడగా పురుగులమందు తాగి ఆపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమణించాడు. వెంటనే దిక్కుతోచక బంధువులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలపై ఆరాతీశారు. పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా మృతురాలికి భర్తతోపాటు ఒక కుమారుడు ఉన్నారు.

పశుగ్రాసం దగ్ధం

పెద్దవడుగూరు : మండలంలోని చిత్రచేడు గ్రామంలో రైతు సన్ననారాయణకు చెందిన పశుగ్రాసానికి గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పు పెట్టడంతో దగ్గమైనట్లు పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగడంతో గమనించి కొందరు రైతుకు తెలియజేయగా మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సుమారు రూ.30వేలు విలువజేసే పశు గ్రాసాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుత్తి : మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఓ రైతుకు చెందిన వేరుశనగ పొట్టు గడ్డి వామి దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా మేరకు గ్రామానికి చెందిన రైతు బండి లక్ష్మీనారాయణ తనకున్న మూడెకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేసి పంట తొలగించిన అనంతరం పశువులకు గ్రాసం కోసం పొలంలో వామి వేసి ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించి గడ్డివాము అగ్నికి ఆహుతైంది. గమనించిన ఇతర రైతులు మంటలను చూసి కేకలు వేసి అందరిని అప్రమత్తం చేశారు. గ్రామంలోని రైతులు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అనంతరం గుంతకల్లు అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపుచేసే లోగా వేరుశనగ పొట్టు మొత్తం కాలిపోయి పనికి రాకుండాపోయింది. పశువుల మేత కాలిపోవడంతో తనకు రూ.60వేలు నష్టం వాటిల్లడంతో పాటు తన పశువులకు గ్రాసం లేకుండా పోయిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను కలిసి కోరాడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు లోడుతో లారీ వెళ్తుంది. అయితే కొత్తపేట గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో అనంతపురం వైపునకు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి లారీ ఢీకొంది. ప్రమాదంలో వెనుక లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బ తిని తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన లారీ డ్రైవర్ సహదేవన్ లారీలోనే ఇరుక్కుపోయాడు. వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముందున్న లారీ రోడ్డు డివైడర్ పైకి ఎక్కి నిలబడింది. రోడ్డుపై లారీలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీలో నుంచి డ్రైవర్ సహదేవన్ ను బయటకు తీసి లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూశారు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ జెండాను ఎగురవేశారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న 50 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి రామచంద్రారెడ్డి, పరిపాలనాధికారులు, సిబ్బంది, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్పలు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, నాయకులు రమణ, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌కుమార్, డేనియల్,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ఇటుకలపల్లి సమీపంలో ఉన్న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఛైర్మన్ అనంత రాముడు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉపన్యాసాలు, దేశభక్తి పాటలు, నాటికలు, నాట్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఎవో నరసింహారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలాగే టిడిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, నాయకులు శ్రీధర్‌చౌదరి, ఆలం నరసానాయుడు, ఎద్దులపల్లి సుబ్రమణ్యం, తలారి ఆదినారాయణ, రామలింగారెడ్డి, దేవళ్ల మురళి, రాయల్ మురళి, కూచి హరి, లక్ష్మీనరసింహులు, కురబ నారాయణస్వామి, వడ్డే వెంకటేష్, స్వప్న, సంగా తేజస్విని, సరిపూటి రమణ, కృష్ణకుమార్, సరళ, భవాని, చరిత, లక్ష్మీ నరసింహులు, బాలకృష్ణ, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ సురేఖరాణి, డిడిఎం నాబార్డు అనూరాధ, డిజిఎంఎస్ రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, డిఆర్‌ఒఎస్‌డి నారాయణ, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎజిఎం సుబ్బారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్లు రిషిబాల, ముత్యాలన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాసులు, కరుణాకర్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, తదితరులు ఎల్గొన్నారు.

నగరంలోని సాయినగర్‌లో ఉన్న డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రిలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్బర్ అల్తాఫ్, డాక్టర్లు, డాక్టర్ అక్బర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినగర్‌లో ఉన్న రిషిత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపాల్ సరోజ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ఎజిఎం సుబ్బారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, ఎఒ గోపాల్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ప్రధానోధ్యాయులు ప్రకాష్‌రావు రాజ్యాంగ పీఠికపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కే.సుబ్బరాయుడు, ఎం.సాంబశివుడు, టీవీ రెడ్డి, విద్యార్థులతో పాటు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో డిఎంహెచ్ఒ ఇబి.దేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు యుగంధర్, అనుపమ జేమ్స్, నారాయణస్వామి, గంగాధర్‌రెడ్డి, ఎఒ గిరిజామనోహర్‌రావు, డిఎంఒ ఓబులు, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, మినిస్ట్రీయల్ సిబ్బంది విజయ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, పవన్, సురేష్, కమలాకర్ పాల్గొన్నారు.

రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం

అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని సంఘమేష్ నగర్‌లో ఉన్న మాంటిస్సోరి పాఠశాల నందుకరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్స్‌పాల్లు పద్మావతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ఆయా అధికారులు జాతీయ పతాకాలను ఎగురవేశారు. తహశీల్దార్ కార్యాలయంలో డిటి మల్లేష్‌ప్రసాద్, పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెంకట నరసింహ, వ్యవసాయ కార్యాలయంలో ఎఒ కాత్యాయని, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ, రాయలసీమ స్కూల్లో కరస్పాండెంట్ రమేష్‌రెడ్డి జాతీయ పతాకాలను ఎగురవేశారు.

నార్పల : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అరుణకుమారి, ఎంఇఒ కార్యాలయంలో విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి, పంచాయతీ కార్యాలయంలో సర్పంచు సుప్రియ, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలప్ప, రైతు సేవ సహకార సంఘం కార్యాలయంలో ఎఫ్ఐసి సృజన్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సాగర్, మిత్ర పాఠశాలలో కరస్పాండెంట్ శశికళ, ఎల్ఎస్ఆర్డబ్ల్యు పాఠశాలలో కరస్పాండెంట్ లక్ష్మీ, సరస్వతి విద్యా మందిరంలో కరస్పాండెంట్ సంజీవరెడ్డి, పూజిత పాఠశాలలో కరస్పాండెంట్ జనార్ధన్, ఉషోదయ పాఠశాలలో కరస్పాండెంట్ సుధాకర్, నేతాజీ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, శిరిడీసాయి విద్యాలయంలో కరస్పాండెంట్ ఆనంద్, శేఖర్ పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ చంద్రశేఖర్, తదితరులు జాతీయ పతాకాలను ఎగురవేశారు.

గుమ్మఘట్ట : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస, ప్రాథమిక పాఠశాలలు, పోలీస్‌స్టేషన్, వెలుగు కార్యాలయం, సచివాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. మండల వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ రమేష్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ సందేష్, సిహెచ్ఒ మురళీధర్, స్టాఫ్‌నర్సులు కాంతమ్మ, లక్ష్మీదేవి, ఆస్మా, ఫార్మాసిస్ట్ మణిమాల, సూపర్‌వైజర్ బయమ్మ,

పామిడి : మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమ్రాల్లో వ్యవసాయ అధికారి లీనా వసుంధర, పలు పాఠశాలల్లో జాతీయ నాయకుల వేషధారణలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి బి.రామయ్య, ఎపిఒ గంగరాజు, డిప్యూటీ తహశీల్దార్ శ్వేత, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఎంఇఒ ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలవ్యాప్తంగా గణతంత్ర దినోతవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఉషారాణి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఆంజనేయులు, ఎంపిడిఒ కార్యాలయంలో నరసింహారెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శ్రీనివాస బాబు, ఎంఇఒ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహారెడ్డి, పెద్దవడుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎవి.సుధాకర్‌బాబు, లక్షుంపల్లిలో ముక్కర హరినాథ్, చిత్రచేడులో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి జాతీయ పతాకాలను ఎగురవేశారు.

రాప్తాడు : మండలవ్యాప్తంగా గణతంత్ర దినోతవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.వీరనారాయణరెడ్డి, పాఠకులు అదినారాయణరెడ్డి, నాగన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని జంతలూరు 14వ బెటాలియన్‌లో గణతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ ప్రభుకుమార్ జెండా వందనం చేశారు. అనంతరం రాష్ట్ర పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు తలారి పెద్దయ్య, డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ విల్సన్ కేర్, యూనిట్ ఆదిశేషు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నాగేంద్రబాబు, రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్ (జెఎ) రామాంజనేయులు, బెటాన్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్ఎస్ఐ శ్రీధర్, పాల్గొన్నారు.

మండలవ్యాప్తంగా గణతంత్ర దినోతవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు, నాయకుల చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ముని, పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యబాబు, ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒఆర్‌డి మనోహర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంగాదేవి, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డిఒ వసంత్‌బాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.జయరామరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పీడీ జయరామప్ప, పిఆర్‌ఒ శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టనంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు టిడిపి నాయకులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

డి.హీరేహాల్ : మండలంలోని ప్రయివేటు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి పవిత్ర వన్నూరుస్వామి, జడ్పిటిసి హసీనాభాను, ఎంపిడిఒ దాసానాయక్, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సర్పంచు లక్ష్మీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ మునివేలు, ఎస్ఐ నబిరసూల్ పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : తహశీల్దార్ కార్యాలయంలో ఎస్.రమాదేవి, ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒఆర్‌డి నాగభూషణం, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ ప్రవీణ్‌కుమార్, కసారం ఆలయంలో ఇఒ వాణి తన కార్యాలయంలో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

యాడికి : మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ విశ్వనాథ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం రాజ్యాంగ పితామహులు బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అలాగే చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో విజన్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ విద్యార్థులు 225 అడుగుల జాతీయ పతాకాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఈరన్న, స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ నాగేంద్ర, ఇలాహా, రంగ, ఉపాధ్యాయులు, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు ధ్రువ నారాయణ, రామ్మోహన్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదిత్య పవన్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మండల వ్యాప్తంగా ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి, జూనియర్ సివిల్ జడ్జి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద డిఇఇ రెహనా వషీం,ఎఇఇ అశ్విని కుమారి, పెన్షనర్ల భవనంలో సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబుబకర్, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయి బాబు, ఏ దారుల్ ఉలూమ్ ఫైజల్ ఇస్లాం మదరసాలో కమిటీ అధ్యక్షుడు షేక్ మౌలానా అబ్దుల్ హక్ జాతీయ జెండాను ఎగరవేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జండా ఎగరవేశారు.

బెలుగుప్ప : మండల వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ సి.షర్మిల, ఎంపిపి పెద్దన్న, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, కెజిబివి ఎస్ఒ నాగరత్నబాయి, ఎస్ఐ శివ, సర్పంచు శాలిబాయి, డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి, ఎంఇఒ పి.మల్లారెడ్డి, శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, నాయకులు కార్యదర్శి బి.మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, గంగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలోని పోలీస్ క్రీడా మైదానంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సువిద్య ట్యుటోరియల్ విద్యార్థులు మార్చ్ నిర్వహించారు. విద్యార్థుల నుంచి రూరల్ సీఐ చిన్నగౌస్, అర్బన్ సీఐ మహానంది, ఎస్ఐ జనార్ధన్‌నాయుడు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీం లంబోదర యువత శివమణి, ప్రశాంత్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహవీల్దార్ నాగరాజు, పోలీస్‌స్టేషన్ వద్ద ఇన్స్‌పెక్టర్ జయనాయక్, రవాణా శాఖ కార్యాలయం వద్ద ఎంవిఐ విశ్వనాథరెడ్డి, మొదటి సచివాలయం వద్ద మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, ఎల్ఐసి కార్యాలయం వద్ద బ్రాంచ్ మేనేజర్ లక్ష్మానాయక్, కల్లిమఠం హైస్కూల్ వద్ద హెడ్మాస్టర్ రవికుమార్ జాతీయ పతాకాలను ఎగురవేశారు.